# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. దేశ విద్యా వ్యవస్థను 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
2. ఉగ్రవాదంపై సమిష్టిగా పోరాటం చేయవలసిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె .పవన్ కళ్యాణ్ అన్నారు.
3. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 2వ తేదీన 43 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.
4. రాష్ట్రంలో వివిధ పీజీ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఏపీపిజిసెట్‌కు మే 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సెట్ కన్వీనర్ సూచించారు.
5. అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

దేశ విద్యా వ్యవస్థను 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా ఆధునీకరిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన వైయుజిఎమ్ కాంక్లేవ్ సమావేశంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, యువత స్వావలంబన సాధించేలా నైపుణ్యాలతో వారికి సాధికారత కల్పించడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందుకు అనుగుణంగా నూతన జాతీయ విద్యా విధానం రూపొందించామని ప్రధానమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన షెడ్యూల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా అందిందని అధికారులు తెలిపారు. మే 2న కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం ప్రధానమంత్రి బయలుదేరి, విజయవాడ విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం విజయవాడ విమానాశ్రయం చేరుకుని, సాయంత్రం ఢిల్లీకి ప్రయాణమవుతారని తెలిపారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు సంబంధించిన పనులు దాదాపుగా పూర్తయ్యాయనీ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో ప్రధానమంత్రి పర్యటించనున్న ప్రాంతంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ 43 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారని తెలుపుతూ..

వాయిస్ ..28 సెకన్లు

కాగా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు వచ్చే ప్రజలంతా మధ్యాహ్నంలోపు వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఆదేశించారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, సభ వద్దకు బస్సులు బయలుదేరే సమయంలో ప్రజలకు ఆహారం, తాగునీరు ఇవ్వాలని సూచించారు.

---------------------------

ఉగ్రవాదంపై సమిష్టిగా పోరాటం చేయవలసిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన పహల్గాం అమరులకు నివాళి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కశ్మీర్ భారత్‌లో భాగమని ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలన్నారు. మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని పవన్ కల్యాణ్ పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

డీఎస్సీ అభ్యర్థులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు పలు సూచనలు చేశారు. డీఎస్సీ పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు పరీక్షలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. దరఖాస్తుల అప్లోడ్ సమయంలో ముఖ్యమైన విషయాలు జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. డీఎస్సీ ఆన్ లైన్ దరఖాస్తు పార్ట్ -2 కింద ధృవపత్రాలను అప్ లోడ్ చేయడం ఐచ్ఛికమని తెలిపారు. సర్టిఫికెట్ ధృవీకరణ సమయంలో అసలు ధృవపత్రా లను సమర్పించాలని వెల్లడించారు. డీఎస్సీ అర్హత కోసం గ్రాడ్యుయేషన్, పోస్ట్-గ్రాడ్యుయేషన్ మార్కుల ప్రమాణాలు టెట్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయాలలో ఎం.ఏ, ఎం.కామ్, ఎం.ఎస్సీ, ఎం.పీడి వంటి కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఏపీపిజిసెట్‌కు మే నెల 5 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సెట్ కన్వీనర్ ఆచార్య పి. సి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మే నెల 5 లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 9వ తేదీ నుండి ప్రవేశ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. నృత్య కళ గురించి ప్రజలలో అవగాహన పెంపొందించడం, నృత్య విద్యను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. అంతర్జాతీయ నృత్య సంఘం పిలుపుమేరకు 1982 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 29న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రముఖ ఫ్రెంచ్ నృత్య కళాకారుడు, బ్యాలెట్ మాస్టర్ జోన్ జార్జెస్ నోవెర్రే 1727 ఏప్రిల్ 29న జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకుని... ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

----------------------------

రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల్లోకి పొరుగు సేవల విధానంలో ఉద్యోగుల నియామక విధానం, వారి సంక్షేమానికి మరింత మెరుగైన విధానాల్ని రూపొందించేందుకు ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఇందులో సభ్యులుగా ఉంటారని తెలిపింది. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రస్తుతం పొరుగు సేవల సిబ్బంది ఎంత మంది పనిచేస్తున్నారు, వారి నియామకానికి అనుసరించిన విధానం, ప్రస్తుత వ్యవస్థలోని లోపాలు, సమస్యల్నిఈ ఉపసంఘం క్షుణ్నంగా పరిశీలించి సిఫారసులు చేస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

----------------------------

కృష్ణాజిల్లా అవనిగడ్డలోని గుల్లలమోద గ్రామంలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి నుంచి క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించనున్నారని తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశామని వెల్లడించారు.

=====================